4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 11 ఆగస్టు 2024
www.ntnews.com



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# మహనీయులు ఎవరు?

**మన భాషలన్నిటికీ మూల భాష సంస్కృతం. కొద్దిగా వ్యాకరణ సూత్రాలు మారి కొద్దిపాటి తేడాలుంటాయి కానీ పదాలు మాత్రం సంస్కృతంలోంచే వస్తాయి. ఉదాహరణకు 'మహనీయుడు' అన్న పదం తీసుకుంటే సంస్కృతంలో అది 'మహనీయః' అని ఉంటుంది. ఈ మధ్య పొగడ్తలలో ఉత్సాహం, అభ్యాసం కొంచెం శృతిమించి ఉండే ఆంధ్ర పేపర్‌లో రాజకీయాలతో సంబంధం ఉన్న ఒక వ్యక్తిని - ఆయన నాయకుడు కూడా కాదు - మహనీయుడని ఆ సంపాదకుడు రాయడం చూసి కొద్దిగా ఆశ్చర్యపడి, ఆ పదానికి ఉన్న మూల అర్థం వెతికాను.**



**కనకదుర్గ దంటు**
89772 43484

'మహత్' అన్న మూలపదంలోంచి దానికి సంబంధించిన మిగతా పదాలు కూర్పు జరిగింది. మహత్ అంటే 'గొప్పది' చేరుకోవటానికి దుస్సాధ్యమైనదని అర్థం. 'ని' అంటే ఎటువంటి గుణాలు లేని నిరాకారమైనది అని అర్థం. 'య'కారం యోగాన్ని - అంటే కలయిక లేక విలీనాన్ని- సూచించే అక్షరం. అంటే ఏ గుణములేని అన్నిటికంటే గొప్పదైన దానిని చేరుకునేవాడు మహనీయుడు.

సాధారణంగా ఇది ఆధ్యాత్మిక రంగంలో వాడవలసిన పదం. ఎందుకంటే ఏ గుణాలు లేనిది పరమాత్మ ఒక్కటే! అందుకే ప్రపంచంతో సంబంధం లేకుండా నిర్వికార జీవితం గడిపిన శ్రీ రామకృష్ణ పరమహంస, కంచి పరమాచార్యులని మహనీయులని అనవచ్చు. వారు ఏ వికారాలు, లౌకిక కోరికలు లేకుండా బ్రతికిన మహనీయులు. ఒకసారి ఒక శిష్యుడు తెలియనితనంతో తన దగ్గర ఉన్న కొద్ది పాటి డబ్బును గుడిలో చెట్టు కింద గల మంచం మీద ఉన్న పరుపు కింద పెట్టాడట మళ్లీ అవసరమైనప్పుడు తీసుకోవచ్చని. కొద్దిసేపటికి ఎవరో కలవటానికి వస్తే రామకృష్ణ పరమహంస వచ్చి ఆ మంచం మీద కూర్చున్నారు. నిముషంలో వారి శరీరంలో మంటలు పుట్టాయి. ఆ వేడి పొగలుగా బయటికి రావడం చూసి చటుక్కున లేచారుట. ఇద్దరు శిష్యులు పరిగెత్తుకుంటూ వచ్చి ఆ మంచం మీద పరుపు తీసి దులుపుదామనుకున్నప్పుడు ఆ డబ్బు కనిపించిందట! అంటే ప్రపంచానికి సంబంధం ఉన్న ఏదీ రామకృష్ణకు సరిపడదు. అది మహనీయత్వం అంటే!

ఇక సామాజిక రంగంలో కొందరుంటారు. ఏమీ ఆశించకుండా తమ స్థాయికి తగ్గట్టు, ఇతరులకు సహాయం చేసేవారు, నిష్కామకర్మగా. ఆస్పత్రులలో రోగులకు అన్నం పెడతారు. కానీ వారి పక్కనుండి వారిని చూసుకునే వారు అష్ట కష్టాలు పడతారు. బయట హోటళ్లకు వెళ్లి భోజనం చేయాలి. రోగుల పక్కనుండే వారికి తమ ఇంటి దగ్గర వండి తీసుకువచ్చి భోజనాలు పెట్టేవారి గురించి విన్నాం. అది వారు కేవలం కష్టంలో ఉన్న సాటి మనిషికి సేవ చేయాలన్న దృక్పథంతో చేసే గొప్ప పని. కరోనా సమయంలో కూడా చాలాచోట్ల ఇట్లా భోజనాలు పంపిణీ చేశారు కొందరు ఉచితంగా. నిజానికి వీరిని కూడా మహనీయులు అనవచ్చు. బాల కార్మికులని రక్షించేవారు, అనాథ, వీధి బాలల గురించి శ్రద్ధ తీసుకునేవారు కూడా గొప్పవారు. అయితే టీఆర్‌పీలు మాత్రం కావాలనుకునే మన మీడియా వారికి వీరు కనపడరు.

మరి రాజకీయరంగంలో ఒకే పార్టీలో రెండు విభిన్న వ్యక్తిత్వాలున్నవాళ్లని చూస్తున్నాం. వాజపేయికి 1996లో అకస్మాత్తుగా జయలలిత తన సమర్థన ఉపసంహరించుకున్నప్పుడు కేవలం ఒక్క పార్లమెంటు సభ్యుడు తక్కువయ్యాడు. వేరే పార్టీలలోంచి తీసుకుందామని చెప్పినా,



వాజపేయి ఒప్పుకోకుండా ప్రధాని పదవి వదులుకున్నారు. రాజకీయరంగంలో విలువలంటే అవి! మరి అదే పార్టీ ఇప్పుడు చేస్తున్నదేమిటి? ఇదివరకు పక్కపార్టీ వాడిని ప్రలోభపెట్టి తమ పార్టీలోకి మార్పించడాన్ని హార్స్ ట్రేడింగ్ అనే వారు, అంటే గుర్రాలను కొన్నట్టు. మరి మహనీయుడు వాజపేయి పార్టీలో హార్స్ ట్రేడింగ్ చేసే వాళ్లు ఉండటానికి తగినవారేనా?

రాజకీయరంగంలో గొప్పవారి గురించి చెప్పినప్పుడు ఎవరికైనా అబ్రహాం లింకన్ గుర్తురాక మానడు. అమెరికా 16వ దేశాధ్యక్షుడిగా ఎన్నికైన అబ్రహాం లింకన్ అరుదైన వ్యక్తిత్వం ఉన్న రాజకీయ నేత. కట్టెలు కొట్టుకుంటూ, చెప్పులు కుట్టుకొని కుటుంబాన్ని పోషించుకున్న తండ్రికి పుట్టి అగ్రరాజ్యానికి అధినేత అయిన ధీరుడు. అమెరికాలో బానిసత్వాన్ని రూపుమాపడానికి శాయశక్తులా ప్రయత్నించి ఆ కారణంగానే హత్యకు గురై అసువులు బాశాడు. ఆయన అధ్యక్షుడైనపుడు, ఒక ముఖ్యమైన సమావేశంలో ప్రత్యర్థి ఆయనను కించపరచటానికి ప్రయత్నించాడు. 'మా నాన్నకి మీ నాన్న కుట్టి ఇచ్చిన చెప్పులు కొంచెం వదులయ్యాయి. సరిగ్గా లేవు' అని హేళనగా అన్న ఆయనకు లింకన్ సమాధానం చెప్పాడు. 'మా నాన్న గారు ఇప్పుడు లేరు, ఆయన తరపున నేను క్షమాపణ చెప్తున్నాను. వారి దగ్గర నేనూ పని నేర్చుకున్నాను. మీ నాన్న గారు ఆ చెప్పుల జత ఉపయోగించదల్చుకుంటే చెప్పండి. నేను రిపేర్ చేసి ఇస్తాను' అని ఎంతో వినయంగా సమాధానం ఇచ్చాడు. ఆయన మహనీయుడు!

తన కుమారుడికి చదువులో ఏమి చెప్పాలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునికి రాసిన లింకన్ సందేశం ప్రపంచంలోని విద్యారంగాలన్నీ అనుసరించతగ్గది. తన ఉత్తరంలో ఈ విధంగా రాశాడు అబ్రహాం లింకన్. 'ప్రపంచంలో మనుష్యులందరూ మంచివారే ఉండరని మీరు నా కుమారుడికి బోధిస్తారని నాకు తెలుసు. కానీ, ఇంకో విషయం చెప్పండి. ప్రతి దుర్మార్గుడికి ప్రతిగా ఒక మంచి వ్యక్తిత్వం ఉన్న నాయకుడు కూడా ఉంటాడని చెప్పండి. స్వార్థపూరిత రాజకీయాలు నడిపే ప్రతి ప్రతినిధికి ప్రతిగా ఒక నిస్వార్థ వ్యక్తిత్వం ఉన్న నాయకుడు కూడా ఉంటాడని నమ్మకంగా చెప్పండి. ప్రతి శత్రువుకు ప్రతిగా ఒక చక్కటి స్నేహితుడు కూడా దొరుకుతాడని చెప్పండి. కష్టపడి సంపాదించిన చిన్న మొత్తం, మోసం చేసి సంపాదించిన పెద్ద మొత్తం కంటే విలువైనదని చెప్పండి. నా కొడుకు విజయాలను, అపజయాలను ఒకేరకం గా ఎదుర్కొనేటట్టు చేయండి. అసూయ కాకుం డా ఆహ్లాదకరంగా నవ్వుకోవటం నేర్పండి. పుస్తకాలు చదవటం ప్రకృతిని ఆస్వాదించటం నేర్పండి. విశాలమైన ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షులని, తోటలలోని చక్కటి పూలను చూసి ఆనందించటం నేర్పండి. మోసం చేసి పైకి రావటం కంటే పాఠశాలలో అయినా, జీవితంలో అయినా వైఫల్యం చెందడం గౌరవప్రదం అని చెప్పండి. తన మీద, తన ఆలోచనల మీద నమ్మకం కలిగి ఉండాలని నేర్పండి. సున్నిత మనస్కులతో సున్నితంగా ఉండటం, కరకుగా ఉండే మనుష్యులతో దృఢంగా ఉండటంలో శిక్షణ ఇవ్వండి. అందరూ చేస్తున్నారు కదా అని ఒక పని చేయడమో, గుంపులో కలవటమో కాకుండా, తన ఆలోచనలకు పదునుపెట్టి, సరైన నిర్ణయం తీసుకోవాలని చెప్పండి. అందరూ చెప్పింది విని, మంచి మాత్రం గ్రహించేటట్టు చేయండి. విచారంలో కూడా నవ్వటం లేదా కన్నీరు పెట్టడానికి సిగ్గపడనక్కరలేదని కూడా నమ్మేటట్టు చేయండి. నిరాశావాదులని నమ్మవద్దనీ, అతి వినయంగా ఉండే వాళ్లు ప్రమాదకరమనీ, ఆత్మను అమ్ముకోవద్దనీ శిక్షణ ఇవ్వండి. ఒంటరిగా అయినాసరే సత్యం కోసం పోరాడాలని నమ్మకంగా చెప్పండి. గారాబం చేయకండి, అతి చనువు ఇవ్వకండి, కానీ సున్నితంగా చెప్పండి. ఏదైనా, ఓపిక, ధైర్యం ఉండాలనీ, ఆత్మవిశ్వాసం ముఖ్యమనీ, నా కొడుకుకు అర్థం చేయించండి' గౌరవభావంతో అబ్రహాం లింకన్.

**ఈ సందేశం ప్రతి తల్లి, తండ్రి, ఉపాధ్యాయులు పాటిస్తే బహుశా వచ్చే తరాల్లో రాజకీయాల్లో కూడా మోసగాళ్లు, దుర్మార్గులు కాకుండా, మహావ్యక్తిత్వం ఉన్న మనుష్యులు నాయకులయ్యే అవకాశం ఉన్నది. జై తెలంగాణ.**

> **మరి రాజకీయరంగంలో ఒకే పార్టీలో రెండు విభిన్న వ్యక్తిత్వాలున్నవాళ్లని చూస్తున్నాం. అటల్ బిహారీ వాజపేయి 1996లో అకస్మాత్తుగా జయలలిత తన సమర్థన ఉపసంహరించుకున్నప్ప డు కేవలం ఒక్క పార్లమెంటు సభ్యుడు తక్కువయ్యాడు. వేరే పార్టీలలోంచి తీసుకుందామని చెప్పినా, వాజపేయి ఒప్పుకోకుండా ప్రధాని పదవి వదులుకున్నాడు. రాజకీయరంగంలో వి లువలంటే అవి! మరి అదే పార్టీ ఇప్పుడు చేస్తున్నదేమిటి? ఇదివరకు పక్కపార్టీ వాడిని ప్రలోభపెట్టి తమ పార్టీలోకి మార్పించడాన్ని హార్స్ ట్రేడింగ్ అనేవారు, అంటే గుర్రాలను కొన్నట్టు. మరి మహనీయుడు వాజపేయి పార్టీలో హార్స్ ట్రేడింగ్ చేసేవాళ్లు ఉండటానికి తగినవారేనా?**

# ఆర్మీ చేతిలో బంగ్లా భవిష్యత్తు

**మైక్రోఫైనాన్స్‌లో ఆర్థిక సాధికారత అంశంపై చేసిన విశేష కృషికి గానూ 2006లో నోబెల్ పురస్కారం అందుకున్న మొహమ్మద్ యూనుస్ బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ సారథ్య బాధ్యతలు చేపట్టారు. ఆయన మధ్యంతర ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా నియమితులయ్యారు. ఇది ప్రధానమంత్రికి సమానమైన హోదాగా చెప్తున్నారు. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న బంగ్లాదేశ్‌కు ఈ పరిణామం కొంతవరకు ఊరట కలిగించేదే. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలను ఆయన కొత్త పుంతలు తొక్కిస్తారేమో చూడాలి. అయితే ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్జమాన్ రంగంలోకి దిగి, మధ్యంతర ప్రభుత్వానికి యూనుస్ సారథ్యం వహించేలా చేసిన తీరు మాత్రం బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య భవిష్యత్తుకు శ్రేయస్కరం కాదు.**




**వెంకట్ పర్సా**

బంగ్లాదేశ్‌లో రాజకీయ అధికారాన్ని రుచి మరిగిన సైన్యాధిపతి వకార్ ఉజ్జమాన్ చిక్కినట్టే చిక్కి చేజారిపోతున్న దాన్ని అంత సులువుగా వదలకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో ఆయన వెనకడుగు వేసే అవకాశం లేదనే చెప్పాలి. పాకిస్థాన్‌లో మాదిరిగా ఆయన కూడా కర్రపెత్తనానికి పాల్పడవచ్చు. ఆగస్టు 5న హసీనా రాజీనామా తర్వాత బంగ్లాదేశ్ అధ్యక్షుడు మొహమ్మద్ షహాబుద్దీన్ పార్లమెంట్‌ను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ప్రభుత్వం ఆర్మీకి పబ్లిక్ ఫ్రంట్‌గా పనిచేయనున్నది. ప్రపంచంలోనే అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన హసీనా తన సుదీర్ఘ రాజకీయ జీవితానికి విషాదకరమైన రీతిలో ముగింపు పలికారు. ప్రాణాలను కాపాడుకునేందుకు బలవంతంగా తన పదవికి రాజీనామా చేసి, దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది.

> **షేక్ హసీనా తండ్రి, బంగ బంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్ హత్యకు గురై ఆగస్టు 15 నాటికి 50 ఏండ్లు పూర్తవుతాయి. ఈ 50 ఏండ్లలో బంగ్లాదేశ్‌లో సుమారుగా 30 తిరుగుబాట్లు చోటుచేసుకున్నాయి. ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్జమాన్ ఒత్తిడి కారణంగా షేక్ హసీనా బలవంతంగా ప్రధాని పదవిని వదులుకోవాల్సి వచ్చింది. ఇది తాజా తిరుగుబాటుగానే చెప్పుకోవాలి. ఆ వెంటనే బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), జాతీయ పార్టీ, జమాత్- ఈ- ఇస్లామీలతో ఆయన చర్చలు జరిపారు. ఈ పరిణామం మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు దారితీసింది.**

దేశం విడిచి వెళ్లేందుకు షేక్ హసీనాకు వకార్ 45 నిమిషాల సమయమిచ్చారు. దీంతో హసీనా ఆర్మీ విమానమెక్కి ఢిల్లీ శివార్లలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని హిండన్ విమానాశ్రయంలో దిగారు. దిగ్భ్రాంతికరమైన పరిస్థితుల నేపథ్యంలో తన భవిష్యత్తు ప్రణాళికల గురించి కూడా షేక్ హసీనా ఆలోచించుకోలేని స్థితిలో ఉన్నారు. భారత్‌లో హసీనా ఆశ్రయం పొందడం ఇది మొదటిసారి కాదు. 1975లో హసీనా తండ్రి ముజీబ్



సహా యావత్తు కుటుంబసభ్యులు దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో జర్మనీలో ఉన్నందున హసీనా, ఆమె సోదరి ప్రాణాలు దక్కించుకున్నారు. 1975-1981 మధ్యకాలంలో హసీనా భారత్‌లో ఆశ్రయం పొందారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆగస్టు 5 నుంచి ఆమె రెండోసారి మన దేశంలో ఆశ్రయం పొందుతున్నారు.

1947లో భారత్, పాకిస్థాన్‌లకు ఒకే సమయంలో స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటినుంచి భారత్‌లో ప్రజాస్వామ్య మూలాలు వేళ్లూనుకుపోయాయి. పాకిస్థాన్‌లో వలె 1971లో ఆవిర్భవించిన పొరుగుదేశం బంగ్లాదేశ్ కూడా నియంతృత్వంలో కూరుకుపోవడం విచారకరం. జనరల్ అయూబ్ ఖాన్ నుంచి యాహ్యా ఖాన్, జనరల్ జియా- ఉల్- హక్ నుంచి జనరల్ పర్వేజ్ ముషారఫ్ వరకు అనేకమంది సైనిక నియంతల పాలనను పాకిస్థాన్ చవిచూసింది. పాక్ ఆర్మీ ఇప్పటికీ రాజకీయాలపై ఆధిపత్యం కొనసాగిస్తూనే ఉన్నది. స్వాతంత్ర్య పోరాటం కారణంగా 1971లో ఆవిర్భవించిన బంగ్లాదేశ్‌లోనూ ప్రజాస్వామ్యం పట్టాలు తప్పినప్పుడు ఆ దేశం నియంతృత్వంలోకి జారుకున్నది.

1947లో స్వాతంత్ర్య పోరాటం నుంచి ఆవిర్భవించిన భారత నాయకత్వం ఎంతో శ్రమకోర్చి దేశంలో ప్రజాస్వామ్యానికి నారుపోసి, నీరుపోసి సంరక్షిస్తూ వచ్చింది. అయితే 1971లో స్వాతంత్ర్యం సాధించిన నాలుగేండ్ల కంటే తక్కువ సమయంలోనే బంగ్లాదేశ్ తిరుగుబాటును చూసింది. ఇది ఆ దేశం ఎదుర్కొన్న తిరుగుబాట్లలో మొదటిది. 1975లో బంగ బంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్ హత్య తర్వాత ఖోండ్‌కర్ ముస్తాక్ అహ్మద్ అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత ఖోండ్‌కర్ ముస్తాక్‌ను గద్దె దించేందుకు బ్రిగేడియర్ ఖాలెద్ ముషారఫ్ తిరుగుబాటు చేశారు. ఆపై హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్ కూడా తిరుగుబాటు ద్వారానే అధికారంలోకి వచ్చారు. ఆయన తర్వాత జియా-ఉర్-రెహ్మాన్ వంతు. షేక్ హసీనా రాజకీయ ప్రత్యర్థి బీఎన్‌పీ నేత బేగం ఖాలెదా జియా గత 17 ఏండ్లు జైలు జీవితం గడిపారు. ఇటీవల దేశాధ్యక్షుడి ఆదేశాల మేరకు ఆమె విడుదలయ్యారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ ఆర్మీ ఇప్పటికీ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తుండటంతో దేశంలో ప్రజాస్వామ్యం మళ్లీ పరిఢవిల్లే అవకాశం అంతంతమాత్రమేనని, ఆ మాటకొస్తే అసలు లేదనే చెప్పాలి.

1972లో బంగ బంధు ముజీబ్ తీసుకొచ్చిన కోటానే ప్రస్తుత వివాదానికి మూలం. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల కోసం ఆయన అప్పట్లో ఓ కోటాను తెచ్చారు. అంతేకాదు, స్వాతంత్ర్య సమరం జరిగిన సమయంలో పాక్ సైనికుల చేతుల్లో చిత్రహింసలకు గురైన మహిళల కోసం కూడా ఒక కోటాను ఏర్పాటు చేశారు. పాకిస్థాన్ ఆర్మీతో పోరాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన, ఇబ్బందులు ఎదుర్కొన్నవారికి కొత్త దేశం న్యాయం చేస్తుందని ముజీబ్ అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుత సంక్షోభానికి కారణం 2018లో జరిగిన కోటా వ్యతిరేక ఉద్యమమనే చెప్పుకోవాలి. 1972 నుంచి కొనసాగుతున్న ఈ ప్రత్యేక కోటా చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను 2018 మార్చి 8న బంగ్లాదేశ్ హైకోర్టు కొట్టేసింది. ఈ నేపథ్యంలో 1971 నుంచి స్వాతంత్ర్య పోరాట యోధుల వారసులకు లబ్ధి చేకూర్చుతున్న ఈ కోటాలను కొనసాగిస్తానని షేక్ హసీనా ప్రకటించారు. తన తండ్రి వారసత్వాన్ని ముందుకుతీసుకెళ్లే క్రమంలో ఈ అంశం హసీనాకు భావోద్వేగపూరితమైనది.

> **కానీ, ఆమె నిర్ణయం విద్యార్థుల్లో ఆందోళనకు దారితీసింది. ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా బంగ్లాదేశ్ సివిల్ సర్వీసెస్‌లో కోటా కనుమరుగైంది. మొదట్లో విద్యార్థులు కోటాలను సంస్కరించాలని కోరారు. వాటిని రద్దు చేయాలని కోరలేదు. కానీ, షేక్ హసీనా నిర్ణయం మాత్రం స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలకు కోటా దక్కకపోతే, మరెవరికీ దక్కవనే సంకేతాలను ఇచ్చింది. ఆ తర్వాత రెండేండ్ల పాటు చర్చలు జరిగినప్పటికీ హసీనా తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అనంతరం 2020లో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ అమల్లోకి వచ్చింది.**

యోగ్యత, సామర్థ్యం కంటే వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ సంబంధాలకు విలువిచ్చే వ్యవస్థలో జరుగుతున్న అన్యాయంపై విద్యార్థుల్లో నిరసన వ్యక్తమైంది. వాస్తవానికి స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలకు ఇస్తున్న కోటా అసలు సమస్య కానే కాదు. దీనిని మొదటినుంచీ వారు ఆశ్రిత పక్షపాతంగా చూడటమే సమస్యకు అసలు కారణం. ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో ఆగ్రహానికి గురైన హసీనా.. స్వాతంత్ర్య పోరాటం సమయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన రజాకార్లతో నిరసనకారులను పోల్చారు. హసీనా వ్యాఖ్యలపై భగ్గుమన్న నిరసనకారులు భారీ ర్యాలీ చేపట్టారు. నిరసనకారుల మనోవేదనను అర్థం చేసుకొని, వారి డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి తిరుగుబాటును కఠినంగా అణచివేయాలని హసీనా నిర్ణయించారు. బంగ్లాదేశ్ అవామీ లీగ్ పార్టీకి చెందిన విద్యార్థి విభాగం బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్‌ను ఆమె రంగంలోకి దించారు. వారికి పోలీసుల మద్దతు ఉండేలా చూశారు. ఈ నేపథ్యంలో జూలై 15న జరిగిన ఘర్షణలో ఆరుగురు నిరసనకారులు మరణించారు. ఆ తర్వాత మూడు రోజుల్లోనే 200 మంది మృతిచెందారు. వారిలో 78 శాతం మంది విద్యార్థులు, సామాన్య పౌరులే. ఈ నిరసనల్లో అనేకమంది మరణిస్తున్నప్పటికీ వాటిపై దృష్టిసారించకుండా.. ఆందోళనల కారణంగా జరిగిన ఆర్థిక నష్టంపై షేక్ హసీనా దృష్టిపెట్టారు. అంతేకాదు, రాజకీయ లబ్ధి కోసం నిరసనకారులను ప్రతిపక్ష పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. మృతుల కుటుంబాలను కలవకపోగా.. నిరసనలో ఆస్తి నష్టం జరిగిన ప్రాంతాలను సందర్శించడం మొదలుపెట్టారు. మృతుల పట్ల హసీనా కనీసం సానుభూతి చూపకపోవడంపై ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగింది. మొదట విద్యార్థులు కోటా సంస్కరణ, ఇతర డిమాండ్లను నెరవేర్చాలంటూ నిరసన చేశారు. కానీ, చివరికి హసీనా నుంచి క్షమాపణ, ఆమె రాజీనామా కోసం పట్టుబట్టడం మొదలుపెట్టారు.

1971లో ముజీబుర్ రెహ్మాన్ నేతృత్వంలో సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ ఆవిర్భావాన్ని.. విభజనకు దారితీసిన ముస్లిం లీగ్ నాయకుడు మహ్మద్ అలీ జిన్నా రెండు దేశాల సిద్ధాంతాన్ని తిరస్కరించడంగా భారత్ చూసింది. ఈ సిద్ధాంతం ప్రత్యక్ష కార్యాచరణ రోజుల నుంచి విభజన దాకా చెప్పలేని నష్టాల్ని, కష్టాల్ని తెచ్చిపెట్టింది. బంగ్లాదేశ్ కూడా పాకిస్థాన్ మార్గంలోనే వెళ్లినందున ఆ సంబురం ఎక్కువ కాలం నిలవలేదు. తర్వాతి కాలంలో ఈ ధోరణిని వెనుకతట్టు పట్టించడంలో హసీనా విజయవంతమయ్యారు. అయితే ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు భారత్‌కు అంత మంచివి కావు. పాకిస్థాన్‌లో వలె బంగ్లాదేశ్ భవిష్యత్తును నిర్దేశించేందుకు మరోసారి ఆర్మీ రంగంలోకి దిగింది.

> **స్వాతంత్ర్యం సాధించిన నాలుగేండ్ల కంటే తక్కువ సమయంలోనే బంగ్లాదేశ్ తిరుగుబాటును చూసింది. ఇది ఆ దేశం ఎదుర్కొన్న తిరుగుబాట్లలో మొదటిది. 1975లో బంగ బంధు షేక్ ముజీబ్ హత్య తర్వాత ఖోండ్‌కర్ ముస్తాక్ అహ్మద్ అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత ఖోండ్‌కర్ ముస్తాక్‌ను గద్దె దించేందుకు బ్రిగేడియర్ ఖాలెద్ ముషారఫ్ తిరుగుబాటు చేశారు. ఆపై హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్ కూడా తిరుగుబాటు ద్వారానే అధికారంలోకి వచ్చారు. ఆయన తర్వాత జియా- ఉర్-రెహ్మాన్ వంతు.**




# రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం



**పుల్లెంల గణేష్**
95530 41549

**భారతీయ సామాజిక వ్యవస్థలో కులానికి ఉన్న ప్రాధాన్యం ఏమిటన్నది అందరికీ తెలిసిందే. మన దేశంలో వర్ణ వ్యవస్థే తదనంతర కాలంలో కులాలుగా రూపం సంతరించుకున్నది. అయితే సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి పథంలో ఉన్నవి 10 శాతమున్న అగ్రకులాలైతే.. అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నవి మాత్రం 90 శాతమున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలేనన్నది జగమెరిగిన సత్యం.**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని చెప్పిన విషయం విదితమే. ధర్మాసనంలోని ఆరుగురు న్యాయమూర్తులు వర్గీకరణను సమర్థించగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో మరోసారి వర్గీకరణ చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఏపీలో వలె మాదిగ- దాని ఉపకులాలకు 7 శాతం, మాల- దాని ఉపకులాలకు 6 శాతం మేర రిజర్వేషన్లు కల్పిస్తే.. మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. జనాభా పెరగడమే అందుకు కారణం. అందుకే జనాభా దామాషా ప్రకారం.. ఎస్సీలలో ఎక్కువగా ఉన్న మాదిగలకు 11-12 శాతం, మిగతా ఉప కులాలకు వారి ప్రాతినిధ్యానికి తగ్గట్టుగా వాటా ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. తద్వారా ఎస్సీల్లోని అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుంది.

మన దేశ మొత్తం జనాభాలో ఎస్సీలు దాదాపుగా 20 శాతం ఉండగా.. తెలంగాణలో 18-20 శాతం వరకు ఉన్నట్టు అంచనా. తెలంగాణలో మాదిగలు 50 లక్షల మంది ఉండగా.. మాలలు 30 లక్షలు, ఇతర ఉపకులాలతో కలిపి మొత్తం ఎస్సీ జనాభా కోటి వరకు ఉండొచ్చు. ఇప్పటివరకు విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీల్లోని కొన్ని వర్గాలే ఎక్కువగా లబ్ధి పొందగా.. అనేక ఉపకులాలు నష్టపోయాయి. ఈ కారణంగానే ఎస్సీ వర్గీకరణ ఉద్యమం మొదలైంది. సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తాజా తీర్పుతో ఇప్పటివరకు నష్టపోయిన వర్గాలకు లబ్ధి చేకూరనున్నది. ఆయా వర్గాలు రాజ్యాంగబద్ధంగా వారికి దక్కాల్సిన హక్కును పొందనున్నాయి. అయితే ఎస్సీ వర్గీకరణతోనే ఆయా కులాలు అభివృద్ధి పథంలోకి వస్తాయనుకోవడం భ్రమే. ఎందుకంటే, రాజ్యాధికారంలో ఉన్న కులాలు మాత్రమే అన్నిరంగాల్లో వృద్ధి చెందుతున్నాయన్నది చరిత్ర మనకు చెప్తున్న సత్యం. అందుకే అణగారిన వర్గాల సకల సమస్యలకు రాజ్యాధికారమే అంతిమ పరిష్కారమని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చెప్పారు. రాజ్యాధికారంలో ఉన్న కులాలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెంది.. అణగారినవర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తాయన్న సత్యాన్ని ఆయన మాటల ద్వారా మనం అర్థం చేసుకోవాలి. ఈ విషయాన్ని గ్రహించిన కాన్షీరాం యూపీ వేదికగా 20 ఏండ్ల పాటు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పోరాటం చేసి దళితుల నాయకత్వంలో రాజ్యాధికారాన్ని సాధించారు. మరి తెలంగాణ వేదికగా మెజారిటీ ప్రజల రాజ్యాధికారం కోసం ఎంతమంది పోరాటం చేస్తున్నారనేది మేధావులు, విద్యావంతులు ఒక్కసారి ఆలోచించాలి.

అగ్రవర్ణాలతో పోరాడి అణగారిన వర్గాలకు కూడా ఓటుహక్కును సాధించిన మరుక్షణం అంబేద్కర్ ఇలా చెప్పారు. 'ఓ నా అణగారిన సమాజమా! మీరు తరతరాలుగా అగ్రవర్ణ సమాజం చేత అన్నివిధాలుగా అణచివేతకు గురవుతున్నారు. కాబట్టి, మీకు ఓటు అనే వజ్రాయుధాన్ని ఇచ్చాను. ఇకపై ఆ ఓటును మీ ప్రయోజనాల కోసం వేసుకొని, దేశానికి పాలకులుగా మారాలి' అని హితబోధ చేశారు. మరి ఆ మహనీయుడు చూపిన మార్గంలో నేడు మనం వెళ్తున్నామా, లేదా? అనేది ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఇకనైనా బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలి. వర్గీకరణతోనే సంతృప్తి చెందకుండా రాజకీయ పోరాటం కూడా చేస్తే సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వృద్ధి చెందవచ్చు. లేకపోతే కేవలం పది శాతం ఉన్న అగ్రకుల పాలకులిచ్చే సంక్షేమ పథకాల కోసం మరికొంత కాలం ఎదురుచూడక తప్పదు.



## నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి!

**మేం (ఆప్ నేతలు) రథానికి ఉండే అశ్వాల్లాంటి వాళ్లమే. మన రథసారథి ఇంకా జైల్లోనే ఉన్నారు. వారు (బీజేపీ నేతలు) రాజ్యాంగం కంటే శక్తిమంతులేమీ కాదు. ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టడమే కాకుండా, పౌరులను కూడా హింసిస్తున్న నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలి.**

**- మనీశ్ సిసోడియా, ఆప్ నేత**